సాక్షి
నంద్యాల

శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



పార్వేట వైభవం

ఆళ్లగడ్డ: పట్టణంలో అహోబిలేశుడి పార్వేట మహోత్సవం గురువారం వైభవంగా సాగింది. భక్తులు ఉత్సవ పల్లకీని భుజాలపై మోసుకుంటూ తెలుపులపై కొలువుంచుతూ భక్తిని చాటుకున్నారు.



కల్యాణం.. కమనీయం

మహానంది: కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దంపతులకు గురువారం కల్యాణోత్సవ పూజలు చేపట్టారు. అలంకార మండపంలో వేద మంత్రాల మధ్య కల్యాణోత్సవాన్ని నిర్వహించా రు.



ఆయిల్ పామ్.. ఆశా కిరణం!

ఆయిల్ పామ్ సాగుచేసేందుకు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రైతులు ఆసక్తి చూపారు. దీని వెనుక గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి ఎంతో ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 8లో▸

న్యూస్‌రీల్

వ్యాధుల నుంచి లేగదూడలను కాపాడుకోండి

- పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి గోవింద నాయక్



రైతుకు మందులు అందజేస్తున్న అధికారులు

రుద్రవరం: వ్యాధుల నుంచి లేగదూడలను కాపాడుకోవాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి గోవింద నాయక్ పశుపోషకులకు సూచించారు. మండల పరిధిలోని ఎర్రగుడిదిన్నెలో గురువారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం ద్వారా లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రైతులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ప్రదర్శనకు 45 లేగ దూడలు రాగా అందులో ఆరోగ్యంగా ఉన్న దూడలను గుర్తించి వాటి యజమానులకు బహుమతులు, వాటి ఎదుగుదలకు మరింత అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా పశు గణన అభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ రాజశేఖర్, ఆళ్లగడ్డ ఉప సంచాలకులు రమణయ్య, చాగలమర్రి, ఆళ్లగడ్డ, రుద్రవరం సహాయ సంచాలకులు వరప్రసాదు, కొండా రెడ్డి, గిడ్డయ్య, వైద్యులు మనోరంజన్ ప్రతాప్, బాలాజీ నాయక్, శ్రీనివాసులు, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి ఉన్నారు.

10 నుంచి ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్

నంద్యాల (న్యూటౌన్): ఈనెల 10 నుంచి ఇంటర్మీడియెట్ జనరల్ ప్రాక్టికల్స్ ఉంటాయని డీఐఈఓ సునీత, స్పెషల్ అధికారి శంకర్‌నాయక్ తెలిపారు. ఇంటర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్లతోపాటు సైన్స్ లెక్చరర్స్‌తో గురువారం వారు సమావేశమయ్యారు. ప్రాక్టికల్ సెంటర్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లాలో జనరల్ ప్రాక్టికల్స్‌కి 64 సెంటర్లను కేటాయించామని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో డీఈసీ మెంబర్లు పీవీ రామన్, కృష్ణయ్య, ప్రభాకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో టెక్నికల్ ఎగ్జామ్స్ టైంటేబుల్

నంద్యాల(న్యూటౌన్): టెక్నికల్ కోర్సు పరీక్షల టైంటేబుల్ వెబ్‌సైట్ ఉంచినట్లు డీఈఓ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో లోయల్, హయ్యర్ గ్రేడ్‌లలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ఈనెల 19 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. టైంటేబుల్‌ను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు



ఫిల్టర్‌బెడ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవస్థాన ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు తాగునీటి సమస్య రానివ్వొద్దని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా గురువారం దేవస్థాన ఈఓ రక్షిత మంచినీటి సరఫరాను, నిర్మాణంలో ఉన్న మినీ కల్యాణకట్ట, పలు పార్కింగ్ ప్రదేశాలు, గణేశ సదన్ ఎదురుగా ఉన్న సెంట్రల్ పార్కింగ్ ప్రదేశం, సీఆర్‌ఓ ఆఫీస్ వద్ద పార్కింగ్ తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తుల రద్దీకి అనుగుణంగా తాగునీటి సరఫరా ఉండాలన్నారు. నీటి కాలుష్యం వల్ల ఏర్పడే రోగాలను నివారించేందుకు నీటిని శుభ్రపరిచే విధానంలో ప్రమాణాలు పాటించాలన్నారు. వివిధ ప్రాంతాల్లోని తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. అనంతరం గణేశ సదనం ఎదురుగా నిర్మిస్తున్న మినీ కల్యాణ కట్టను పరిశీలించారు. వారం రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. సెంట్రల్ పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించి, తాగునీటి సరఫరా, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సీఆర్‌ఓ ఆఫీసు వద్ద పార్కింగ్ ప్రదేశంలో లడ్డూ ప్రసాదాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీబాలకృష్ణ, నరసింహారెడ్డి, డీఈఈ చంద్రశేఖర శాస్త్రి, ఏఈ రాజేశ్వరరావు ఉన్నారు.

కుంటలకు పద్దుల్లేవు.. ఆక్రమణకు హద్దుల్లేవు

- వేలాది ఎకరాల చెరువులు, కుంటలు, కాల్వలు కబ్జా
- పేదల మాటున పెద్దల దురాక్రమణ
- పట్టించుకోని అధికార గణం
- రెవెన్యూ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయలోపం

ఐదారు శతాబ్దాల పాటు సాగు, తాగునీటి అవసరాలను తీర్చిన చెరువులు, కుంటలు ప్రస్తుతం ఉనికినే కోల్పోతున్నాయి. ఒకప్పుడు నిండు కుండల్లా నీటితో కళకళలాడిన జలాశయాలు నేడు ఆక్రమణలకు గురవుతున్నాయి. కొందరు ఏకంగా పట్టాలను సైతం పొంది ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమకెందుకులే అని మిన్నకుండిపోతుండటంతో కబ్జాల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. ఇది ఇలాగే కొనసాగితే దాతల దాతృత్వంతో తవ్వించిన చెరువులు, కుంటల ఆనవాళ్లు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చెరువులో సాగుచేసిన పొలానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు విడుదల చేసినట్లు చూపుతున్న బోర్డు

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలో చిన్ననీటి పారుదలశాఖ పరిధిలో 23, పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో 22 చెరువులున్నాయి. వీటి కింద 36,896.12 ఎకరాల ఆయకట్టు ఉంది. రెవెన్యూ, జలవనరులు, పంచాయతీరాజ్ శాఖల లెక్కల ప్రకారం చెరువులు 9,380.95 ఎకరాలు, కుంటలు 700, వాగులు 2,300 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. వీటిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో స్థానిక నేతలు ఎక్కడికక్కడ కబ్జాలకు తెరలేపుతున్నారు. కొన్ని చోట్ల జలవనరులు అన్యాక్రాంతం అయినట్లు గుర్తించిన ఆశాఖ ఇంజినీర్లు ఆయా మండల తహసీల్దార్లకు లేఖలు రాసినప్పటికీ వారి నుంచి స్పందన ఉండటం లేదు.

సరిహద్దులు లేక సులువుగా కబ్జా

చెరువులు, కుంటలకు సరైన సరిహద్దులే లేవు. పూర్తి స్థాయిలో సర్వే చేసి హద్దులు గుర్తించాల్సి ఉన్నా ఆ ప్రక్రియలో జాప్యం కొనసాగుతోంది. మరోవైపు చెరువుల్లో నీటి మట్టం తగ్గాక రబీ (ఎండకారు) పంటలు సాగు చేసుకునేలా చాలా చోట్ల 'ఏక్ ఫసలీ' ఒప్పందంపై పట్టాలు పొందిన వారు ఉన్నారు. నీటి మట్టం కొనసాగిన సమయంలో ఈ పట్టాదారులు పంటల సాగును చేపట్టకూడదు. అస్సలు సేద్యాలే చేయకూడదు. అయినప్పటికీ పలు చోట్ల తూములు తెరిచి నీటిని వృథాగా దిగువకు వదులుతున్నారు. చెరువుల పూర్తిస్థాయి నీటి మట్టం (ఎఫ్‌టీఎల్), హద్దులు గుర్తించాల్సిన ఉన్నా ఆ ప్రక్రియను పట్టించుకున్న పాపాన పోవడంలేదు. కొన్ని చోట్ల ఎఫ్‌టీఎల్‌ను కూడా ఇష్టారీతిన మార్చుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయన్న ఆరోపణలున్నాయి.

చట్టం.. వారికి చుట్టం

నియోజకవర్గంలో జలవనరుల మొత్తం విస్తీర్ణం 12,380.95 ఎకరాలు ఉంటుందని రెవెన్యూ నివేదికలు చెబుతున్నాయి. కానీ వాస్తవానికి ఇపుడు వీటి విస్తీర్ణం 5 నుంచి 6 వేల ఎకరాల్లోపే. కొందరు అధికార పార్టీకి చెందిన అక్రమార్కులు ఎక్కడి నుంచో వచ్చి కబ్జాలకు పాల్పడుతుండగా.. మరికొందరు నేతలు తమకు సమీపంలో ఉన్న చెరువులను, కుంటలు, వాగుల కట్టలను చదును చేసి కలిపేసుకుంటున్నారు. ఇంకొందరు అక్రమంగా అనుమతులు పొంది బోర్లు తవ్వించారు. విద్యుత్ అధికారులు వాటికి అనుమతులు ఇచ్చి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఉద్యాన, ఉపాధి హామీ అధికారులు సబ్సిడీపై ఉద్యాన పంటలు నాటిస్తున్నారు. చెరువులు, కుంటల్లో బోర్లు తవ్వకం చట్ట రీత్యా విరుద్ధమైనా.. అధికారుల అలసత్వం.. అవినీతి కారణంగా చట్టం వారికి చుట్టమవుతోంది. జలవనరులశాఖ రికార్డుల్లో చెరువులు, కుంటలుగా ఉన్నవి రెవెన్యూ రికార్డుల్లో మాత్రం పొలాలుగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

'రెవెన్యూ'లో లాలూచి.. రైతు నోట్లో మట్టి

చెరువు గర్భాలను రక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై కూడా ఉంది. దశాబ్దాలుగా ఆక్రమణదారులు చెరువు భూములను కబ్జా చేసేస్తున్నా.. ఫిర్యాదులు వస్తున్నా ఆయా గ్రామాల, మండల రెవెన్యూ అధికారులు ఏమి చేస్తున్నారన్నది ప్రశ్నార్థకం. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం చూస్తే ఎకరం భూమి కనీసం రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంది. ఏదైనా సమస్య వచ్చినప్పుడు రెవెన్యూ అధికారులకు భారీ మొత్తంలో ముడుతుండటంతో వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

చెరువు కబ్జా.. అక్రమార్కుల దర్జా



ఈ చిత్రం ఎల్లావత్తుల, టి.కొట్టాల, డి.కొట్టాల గ్రామాల పరిధిలోని పెద్ద చెరువు చెరువు గట్టు. ఒకప్పుడు దారిని ఆనుకుని ఉండేది. 673, 674 సర్వే నంబర్లలో 75 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువు కింద మూడు గ్రామాల్లోని 105 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆక్రమణదారులు చెరువు గర్భంలో సాగు చేసుకున్న పొలంలోకి చెరువు నీరు రాకుండా ఆ కట్టనే క్రమేపి జరిపేశారు. కట్టకు, దారికి మధ్య సుమారు 15 ఎకరాల పొలం సాగు చేసేశారు. అందుకు నిదర్శనం ఈ కట్ట.



చెరువు.. కనుమరుగు..!

ఈ చిత్రంలో ఏపుగా పెరిగిన ఉద్యాన చెట్లను చూసి సాగుభూమి అనుకుంటే పొరపాటే! అదొక చెరువు గర్భం. క్రమక్రమంగా ఆక్రమించేసి అక్కడి నుంచి మామిడి, నిమ్మ, చీని, టెంకాయ చెట్లను పెంచేశారు. ఇలా ఎకరా అరెకరం కాదు.. దాదాపు 30 నుంచి 40 ఎకరాలు పరాధీనమైంది. చెరువు అసలు విస్తీర్ణం ఆర్‌ఎస్‌ఆర్ లెక్కల ప్రకారం 213 ఎకరాలు. ఇప్పుడు మిగిలింది మాత్రం 150 ఎకరాలే. ఇదీ మండల కేంద్రం రుద్రవరంలోని రంగారెడ్డి చెరువు పరిస్థితి.

కట్టను చదును చేసి.. దర్జాగా రహదారి వేసి..

ఇక్కడ కనిపిస్తున్నది ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ప్రభుత్వం వేసిన రహదారి అనుకుంటే పొరపాటే. ఇది కోటకొండ కల్యాణి చెరువు కట్ట. ఈ చెరువు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల పరిధిలో ఉండటంతో పాటు కట్ట పక్కనే రిజర్వు ఫారెస్ట్ ట్రెంచ్ సైతం ఉంది. అయినప్పటికీ చెరువు కట్టను చదును చేసి రోడ్డు వేశారు. అక్రమంగా రూ.కోట్లు విలువైన మట్టి దందా కొనసాగించేందుకు వందల ఏళ్ల క్రితం నిర్మించిన చెరువు కట్టను ధ్వంసం చేశారు. ఒక వేళ మళ్లీ కట్ట నిర్మించినా అంత బలంగా ఉండదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడక పోవడం గమనార్హం.





పెద్దల కుంట.. చిన్న బోతోంది!

ఇది రుద్రవరం మండలం తిప్పారెడ్డిపల్లె, లింగందిన్నె గ్రామాల పరిధిలోని మాడిశెట్టివాళ్ల కుంట. మారుమూల కొండకింది పల్లెలు అయిన ఈ గ్రామాలు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయి. ఇక్కడ పశుపక్షాదులు తాగేందుకు ఏ మాత్రం నీటి వనరులు లేకపోవడంతో సర్వే నంబర్ 634/1 లోని 7.41 ఎకరాల ప్రభుత్వ భూమిలో దాతలు కుంట తవ్వించి గ్రామస్తులకు అప్పగించారు. దీంతో పశువులకు, ప్రజలకు తాగునీటితోపాటు సుమారు 50 ఎకరాలకు సాగు నీరు సమృద్ధిగా అందేది. చుట్టూ ఉన్న భూ యజమానులు ఈ కుంటను ఆక్రమించుకోవడంతో ప్రస్తుతం ఎకరం లోపు చిన్న బురద గుంత అయ్యిందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



మా గ్రామానికి ఓ వైపు సుమారు 3 కి.మీ మేర విశాలమైన తుండ్ల వాగు ఉండేది. ఈ వాగు నుంచి వచ్చే నీటితో 4, 5 చెరువులు నిండేవి. కొందరు సుమారు 100 ఎకరాల మేర ఆక్రమించుకోవడంతో అంత పెద్ద వాగు పిల్ల కాలువలా మారిపోయింది. అధికారులకు ఎన్నో సార్లు చెప్పినా స్పందన లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – లింగన్న, తిప్పారెడ్డిపల్లె

టీడీపీ నాయకుడు ఆక్రమించాడు



మా పంచాయతీ మజరా గ్రామం కొత్తపల్లెలో 84 సర్వే నంబర్లో 1.34 ఎకరాల ఊర వంక ఉంది. దీన్ని టీడీపీ నాయకుడు ఆక్రమించుకోవడంతో వర్షపు నీరు గ్రామంలోని ప్రధాన రహదారిలో సుమారు మూడు అడుగులపైన నిలిచి మురికి కూపంగా మారుతోంది. ఈ మురికి కూపంలోనే పొలాలకు, శ్మశానానికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. – బాలీశ్వర్‌రెడ్డి, డి.వనిపెంట

కబ్జా చేస్తే కఠిన చర్యలు



పోరంబోకు భూములు, కుంటలు, చెరువులు ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మాకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. సంబంధిత అన్ని శాఖల అధికారులతో చర్చించి అధికారులను చెరువుల వద్దకు పంపి ఆక్రమణ విషయంపై విచారణ చేయిస్తాం. ఎక్కడైనా ఆక్రమణలు ఉన్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటాం. – మల్లికార్జున, తహసీల్దార్, రుద్రవరం

పచ్చ నేతల బరి తెగింపు

- 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న రేకుల షెడ్డు కూల్చివేత
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులని కక్ష సాధింపు
- అధికారులపై ఒత్తిడి తెచ్చి షెడ్డు కూల్చివేత
- పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన బాధితురాలు
- చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలింపు
- పెద్ద కొప్పెర్లలో టీడీపీ నేతల అరాచకం



రేకుల షెడ్‌ను కూల్చివేస్తున్న దృశ్యం



షెడ్డు ఆధారాలు చూపుతున్న కుమారుడు, తల్లి

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతల దౌర్జన్యాలు, అక్రమాలు, దోపిడీలు, బెదిరింపులకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. పచ్చ నేతలకు అధికారులు సైతం సలాం చేయాల్సి వస్తోంది. తాజాగా గురువారం పెద్దకొప్పెర్లలో టీడీపీ నాయకుల అరాచకానికి ఓ వృద్ధురాలు నిలువు నీడ కోల్పోయింది. బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ కుటుంబం 30 ఏళ్ల పాటు తెలుగుదేశం పార్టీలో ఉండి సేవ చేసినా ఎలాంటి గుర్తింపు లేకపోవడంతో 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయన కుమారుడు రియాజ్, అల్లుళ్లు రహంతుల్లా, అసరఫ్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు అండగా నిలిచారు. దీన్ని జీర్ణించుకోలేకపోయిన టీడీపీ నాయకులు గత ఎన్నికల్లో అధికారం దక్కడంతో ఆ కుటుంబంపై కక్ష గట్టారు. మహమ్మద్ రఫీ తల్లి ముల్లా కమరూన్‌బీ 30 ఏళ్లుగా ఉంటున్న రేకులషెడ్ ప్రభుత్వ స్థలమని టీడీపీ నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థలానికి సంబంధించి ఏవైనా ఆధారాలు ఉంటే అందజేయాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి నోటీసులు జారీ చేశారు. 30 ఏళ్లుగా ఆ స్థలంలో రేకుల షెడ్‌లో ఉంటూ ఆ స్థలాన్ని కుమార్తె షంషాద్‌బీకి రిజిస్టర్ చేయించి ఇచ్చింది. ఈ వివరాల ఆధారంగా వృద్ధురాలి కుమారుడు మహమ్మద్ రఫీ కోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్ తీసుకొచ్చాడు. వీటిని పరిగణలోకి తీసుకోకుండా టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తేవడంతో ప్రొక్లెయిన్‌తో షెడ్‌ను కూల్చివేయించారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

రేకుల షెడ్‌ను కూల్చి వేస్తుండటంతో ముల్లా కమరూన్‌బీ ఇంట్లో ఉన్న క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వృద్ధురాలిని చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి తమ కుటుంబంపై కక్ష కట్టి షెడ్డు కూల్చివేయించాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి షెడ్ కూల్చివేతను ఖండించారు. ఈ విషయమై ఈఓపీఆర్‌డీ ప్రకాష్‌నాయుడు మాట్లాడుతూ సామూహిక మరుగుదొడ్డి స్థలంలో ఉన్న అక్రమ కట్టడాన్ని నిబంధనల ప్రకారమే తొలగించామని పేర్కొన్నారు.

ఉగాది నుంచి పీ-4 విధానం అమలుకు చర్యలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్

నంద్యాల: వచ్చే ఉగాది నుంచి రాష్ట్రంలో పీ-4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్స్-పార్టనర్ షిప్) విధానం అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. గురువారం అమరావతి నుంచి పీ-4 విధానంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి, డీఆర్‌ఓ రాము నాయక్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సీఎస్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4 విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న పది శాతం మంది పేదరికంలో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మందికి చేయూతనివ్వడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నదే పీ-4 విధానం ధ్యేయమన్నారు. పూర్తి స్థాయిలో విధి విధానాల రూపకల్పనకు ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించడంతోపాటు ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు గానూ ప్రతి నియోజకవర్గానికి జిల్లా స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో 500 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు వెంటనే స్థలాలు గుర్తించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి విజన్ ప్రణాళికల తయారీ కోసం నోడల్ అధికారులను నియమించాలని సీపీఓను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న ఎంఎస్‌ఎంఈ సర్వేను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలకు సూచించారు. ఇప్పటి వరకు ఎంఎస్‌ఎంఈకి సంబంధించి లాగిన్ కాని సిబ్బందికి షోకాజ్ నోటీసులివ్వాలని ఆదేశించారు. ఎంప్లాయిస్ హౌస్ హోల్డ్ డేటాను వెంటనే పూర్తి చేయించాలన్నారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు భూములను గుర్తించాలని ఆర్డీఓలకు సూచించారు. సమావేశంలో సీపీఓ వేణుగోపాల్, డీఈఓ జనార్ధన్ రెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఎల్‌డీఓ శివారెడ్డి, డీపీఓ జమీవుల్లా పాల్గొన్నారు.

లోకాయుక్తను నేరుగా ఆశ్రయించండి

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ ప్రమాద బాధితులు నేరుగా లోకాయుక్తను ఆశ్రయించి పరిహారాన్ని పొందాలని ఉపలోకాయుక్త జస్టిస్ పి.రజనీ సూచించారు. ఓ కేసులో కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడుకు చెందిన వీర్ల మల్లికార్జున భార్య బాలవర్ధినికి రూ.5 లక్షల పరిహారాన్ని ఇచ్చినట్లు ఏపీసీపీడీసీఎల్ (విజయవాడ) నివేదించడంతో ఉప లోకాయుక్త ఆ కేసును గురువారం మూసి వేసింది. 2024 ఆగస్టు 15న బాలవర్ధిని భర్త వీర్ల మల్లికార్జునుడు పొలంలో మోటార్‌కు మరమ్మతులు చేస్తుండడంతో ప్రమాదం సంభవించి మరణించారు. బాధితుడి కుటుంబానికి పరిహారం అందజేతలో జాప్యం కావడంతో సామాజిక కార్యకర్త శ్రీనివాసగౌడ్ లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో కార్పస్ ఫండ్ నుంచి మృతుడి భార్యకు పరిహారం మంజూరైంది. కాగా, విద్యుత్ ప్రమాదాల్లో బాధితులకు ఏపీసీపీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్ పరిహారాలు ఇవ్వకుంటే నేరుగా లోకాయుక్తను ఆశ్రయించాలని ఉప లోకాయుక్త బాధితులకు సూచించారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి బాధితులకు లోకాయుక్త న్యాయం చేస్తుందని ఆమె వివరించారు.

ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల (న్యూటౌన్): పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం టెక్కే మార్కెట్ యార్డ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు వేలాది మంది అర్జీదారులతో ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దారు రామసంజీవయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో పట్టణాల్లో రెండు, పల్లెటూళ్లలో మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి ఆరు నెలలు గడిచినా ఇంతవరకు అతీగతీ లేదన్నారు. మరో ఆరు నెలల గడువు ఇస్తున్నామని, పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వలేనిపక్షంలో ఇల్లు లేని నిరుపేదలతో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, మహిళా సంఘం నాయకురాళ్లు లక్ష్మీదేవి, మాలన్‌బీ, సుశీలమ్మ, మున్ని తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న పోలీసుల వేట


కరిమద్దెల గ్రామ పొలాల వద్ద పోలీసులు

గడివేముల: నంద్యాల, పాణ్యం మండలాల్లో దోపిడీలు చేసిన దొంగల కోసం బుధవారం ఉదయం నుంచి గురువారం తెల్లవారుజాము వరకు పోలీసులు ముమ్మరంగా వేట సాగించారు. ఎనిమిది ఎకరాల్లో ఉన్న మొక్కజొన్న పంటలో ఇద్దరు దొంగలు దాక్కొని ఉన్నారని సమాచారం అందడంతో పోలీసులు పంట పొలాలను జల్లెడ పట్టారు. ఆచూకీ లభ్యం కాక పోవడంతో చుట్టుపక్కల పొలాల్లో గాలించారు. పొలాలకు కూలీలను, రైతులను వెళ్ల కుండా పోలీసు పహారా కాశారు. చుట్టుపక్కల గ్రామాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అలాగే బండిఆత్మకూరు మండలంలోని పలుప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

పాల విక్రయ కేంద్రాలపై విజి'లెన్స్'


శాంపిల్ చూపుతున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మా నాయకులు

కర్నూలు: పాలు, నెయ్యి తదితర వాటిని విక్రయ కేంద్రాల్లో కల్తీ చేసి విక్రయాలు జరుపుతున్నట్లు ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు వాటిపై దృష్టి సారించారు. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి చౌడేశ్వరి ఆదేశాల మేరకు ఆహార భద్రత శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ కూర్మా నాయకులుతో పాటు విజిలెన్స్ సిబ్బంది గురువారం పాల విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని నందికొట్కూరు రోడ్డులో ఉన్న ఏబీ ధాయ్ (మిల్క్ బ్యాంక్) పేరుతో నిర్వహిస్తున్న దుకాణంలో తనిఖీలు నిర్వహించగా లూజు నెయ్యిని బ్రాండెడ్ కంపెనీల పేరుతో విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించారు. అనుమతులు లేకుండా పాలు, నెయ్యి విక్రయాలు జరుపుతున్నట్లు తనిఖీల్లో బయటపడింది. అలాగే కర్నూలు మండలం భూపాల్ నగర్‌లోని ఎల్‌వీ రెడ్డి డెయిరీ ఫామ్‌లో కూడా తనిఖీలు నిర్వహించారు. పాల ప్యాకెట్లపై ప్యాకింగ్ తేదీలు ముద్రించకుండా విక్రయాలు జరుపుతున్నట్లు బయటపడింది. దీంతో రెండు చోట్ల కూడా పాలు, నెయ్యి పదార్థాలను సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. కల్తీ జరిగినట్లు పరీక్షల్లో బయటపడితే తదుపరి చర్యలు ఉంటాయని విజిలెన్స్ అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్, డీసీటీఓ వెంకటరమణ, అసిస్టెంట్ జియాలజిస్ట్ సిద్ధయ్యతో పాటు విజిలెన్స్ సిబ్బంది ఉన్నారు.

పశుగ్రాసం దగ్ధం

హొళగుంద: మండలంలోని హొళగుంద, ముద్దటమాగి గ్రామాల్లో గురువారం ఆరు గడ్డివాములు దగ్ధమయ్యాయి. రైతులకు రూ.4.50 లక్షల నష్టం వాటిల్లింది. ముద్దట మాగి గ్రామ శివారులో రైతు కురువ ఈరన్న.. రెండు గడ్డివాములు, ఒక జొన్న సొప్ప వాము వేశారు. పక్కనే ఉన్న పేడదిబ్బలో వేసిన బూది నుంచి మంటలు వచ్చి వాములు దగ్ధమయ్యాయి. అలాగే హొళగుంద దిడ్డి కాలనీలోని చెరువు గట్టు వద్ద కూడ్లూరు రఫీక్ వేసుకున్న రెండు గడ్డివాములు, ముల్లా అబ్దుల్లాకు చెందిన ఒక గడ్డివాముకు ప్రమాదవశాత్తూ మంటలు అంటుకుని కాలిపోయాయి. మరో 35 గడ్డివాములకు మంటలు వ్యాపించకుండా స్థానికులు చర్యలు తీసుకున్నారు. ఆలూరు నుంచి వచ్చిన ఫైర్‌ఇంజిన్ మంటలను అదుపు చేసింది. వీఆర్‌ఓలు ఆయా గ్రామాలకు చేరుకుని ఆస్తి నష్టంపై అంచనా వేసి నివేదికను అధికారులకు పంపించారు.

ఆయిల్ పామ్.. ఆశా కిరణం!

- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 455 హెక్టార్లలో మొక్కలు నాటడం పూర్తి
- ఈ నెల చివరిలోగా మరింత పెరిగే అవకాశం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ
- హెక్టారుకు నాలుగేళ్లలో రూ.71 వేల రాయితీ


కృష్ణగిరి మండలంలో ఆయిల్ పామ్ సాగు



కర్నూలు(అగ్రికల్చర్): ఆయిల్ పామ్ సాగు రైతులకు ఆశా కిరణంగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇప్పటికే 455 హెక్టార్ల (1,135 ఎకరాలు)లో మొక్కలు నాటారు. ఫిబ్రవరి నెల చివరిలోపు మరింత సాగు పెరిగే అవకాశం ఉంది. రాయలసీమ జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేపట్టడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. రాయలసీమ జిల్లాల్లో ఈ పంట సాగుకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేసేందుకు 2020–21లో ప్రత్యేకంగా టెక్నికల్ టీమ్‌ను ఏర్పాటు చేసింది. సాంకేతిక బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా తొలుత 2023–24లో సి.బెళగల్ మండలంలో సాగు చేయడం చేపట్టారు. దీంతో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అనేక మంది రైతులు ఆసక్తి చూపారు. దీని వెనుక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి ఎంతో ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కంపెనీల సహకారం

కర్నూలు జిల్లాలో నవభారత్, పతంజలి, లివింగ్ ఫుడ్స్ కంపెనీల ఆధ్వర్యంలో, నంద్యాల జిల్లాలో పతంజలి, నవభారత్, త్రిబుల్ ఎఫ్ ఆయిల్ ఫుడ్, తుమ్మల ఆగ్రో కంపెనీల సహకారంతో ఆయిల్ పామ్ సాగు చేపట్టారు. కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, కర్నూలు, కల్లూరు, సి.బెళగల్ తదితర మండలాల్లో ఇప్పటి వరకు 105 హెక్టార్లలో మొక్కలు నాటారు. నంద్యాల జిల్లాలో ఇప్పటికే 350 హెక్టార్లలో ఈ పంట సాగైంది. ఈ నెల చివరిలోగా కర్నూలు జిల్లాలో మరో 50 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో మరో 200 హెక్టార్లలో ప్లాంటేషన్‌కు అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మూడు, నాలుగో ఏడాది నుంచి ఆయిల్ పామ్‌లో దిగుబడులు మొదలవుతాయి. ఆయా కంపెనీలే మార్కెటింగ్ చేస్తాయి.

దిగుబడి ఇలా..

ఏడాది పొడవునా నీరు లభించే బోర్ల కింద మాత్రమే ఆయిల్ పామ్‌కు సాగుకు ఉద్యాన అధికారులు చర్యలు చేపట్టారు. మొదటి రెండు, మూడేళ్ల ఎకరాకు ఐదారు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఏళ్లు పెరిగే కొద్ది మొక్కలకు ఇచ్చే ఎరువులు, పోషకాలు, నీటిని బట్టి ఎకరాకు 20 నుంచి 30 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

రాయితీలు ఇలా..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,300 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేయించాలని అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. హెక్టారుకు రూ.71 వేలు రాయితీ ఇస్తున్నారు. మొక్కలు, ప్లాంటేషన్ కోసం రూ.29 వేలు, అంతర సేద్యం కోసం రూ.21 వేలు, అంతరపంటల సాగు కోసం రూ.21 వేల ప్రకారం రాయితీ లభిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ రాయితీలు ఖరారయ్యాయి.

ప్రస్తుతం టన్ను ఆయిల్‌సీడ్ ధర రూ.21 వేల వరకు ఉంది. పండించిన పంటను సంబంధిత కంపెనీలే మార్కెట్ ధరకు అనుగుణంగా కొనుగోలు చేస్తాయి. నాలుగేళ్ల వరకు అంతరపంటలు సాగు చేసుకోవచ్చు. ఎకరాకు ఆయిల్ సీడ్ మొక్కలు 57 ప్రకారం, హెక్టారుకు 143 మొక్కలు నాటుకోవచ్చు. పశువుల ఎరువులతో మోతాదు మేరకు రసాయన ఎరువులు వాడవచ్చు. అదనంగా సిఫార్సు చేసిన ప్రకారం సూక్ష్మ పోషకాలు కూడా వాడాలి.

పది ఎకరాల్లో నాటాం



గతేడాది వరకు పత్తి, వేరుశనగ, కంది, ఆముదం, సజ్జ వంటి పంటలు సాగు చేశాం. ఈ సారి ఆయిల్ పామ్ సాగుకు శ్రీకారం చుట్టాం. నీటి సదుపాయం ఉండటంతో ఎకరాకు 57 ప్రకారం 10 ఎకరాల్లో 570 ఆయిల్‌సీడ్ మొక్కలు నాటుకున్నాం. మొక్కలను నవభారత్ ఆయిల్‌సీడ్ కంపెనీ సరఫరా చేసింది. నాలుగేళ్ల వరకు అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. – మదన్‌మోహన్, లక్కసాగరం, కృష్ణగిరి మండలం

కొత్త పంటల వైపు వెళ్తున్నాం



మొదటిసారిగా కొత్త పంటల వైపు వెళ్తున్నాం. 12 ఎకరాల్లో ఆయిల్ సీడ్ మొక్కలు డిసెంబరు నెలలోనే నాటాం. నాలుగేళ్ల పాటు అంతరపంటలు సాగు చేసుకుంటాం. ఐదో ఏడాది నుంచి ఆయిల్ సీడ్ దిగుబడులు వస్తాయి. ప్రస్తుతం టన్ను ధర రూ.21 వేల వరకు ఉంది. ఆ రోజు ఉన్న ధరను బట్టి కంపెనీలే కొనుగోలు చేస్తాయి. – బి.మల్లికార్జున, పారుమంచాల, జూపాడుబంగ్లా మండలం

గిట్టుబాటు అవుతుంది



మేం ఆరు ఎకరాల్లో ఆయిల్ సీడ్ మొక్కలు నాటుకున్నాం. ఈ పంటపై వివిధ ప్రాంతాల్లో అధ్యయనం చేశాం. కంపెనీలు, ఉద్యానశాఖ భరోసా ఇవ్వడంతో సాగు చేపట్టాం. ఎకరాకు సగటున 15 టన్నుల దిగుబడి వచ్చినా గిట్టుబాటు అవుతుంది. మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే 25 టన్నుల వరకు దిగుబడి పొందవచ్చని చెబుతున్నారు. – ఎ.నాగేశ్వరరెడ్డి, వడ్డెమాను గ్రామం, నందికొట్కూరు మండలం

సాగు మరింత పెరగొచ్చు



2025–26 నుంచి జిల్లాలో అయిల్‌పామ్ సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. రైతులు సంప్రదాయ పంటల సాగుకు స్వస్తి పలుకుతూ.. కొత్తకొత్త పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఈ పంట సాగుకు నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. బోర్లు ఉన్న రైతులకు అవకాశం కల్పిస్తున్నాం. – పి. రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

రాజకీయ కార్యకర్తగా ఫైర్‌మన్!

- డీజీకి ఫిర్యాదు చేసిన సహోద్యోగులు

కర్నూలు: కర్నూలు అగ్నిమాపక శాఖలో ఫైర్‌మన్‌గా పనిచేస్తున్న ముదిగేడు రాజ్‌కుమార్ విపరీత ప్రవర్తనను భరించలేక సహోద్యోగులు.. ఆంధ్రప్రదేశ్ విపత్తు స్పందన ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేశారు. విజయవాడ సెక్రటేరియట్, అసెంబ్లీ చుట్టూ తిరుగుతూ ప్రభుత్వ ఉద్యోగిలా కాకుండా రాజకీయ కార్యకర్తగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫైర్ ఆఫీసర్‌తో పాటు కింది స్థాయి సిబ్బందిని ఎవరినీ లెక్క చేయకుండా తిట్లు తిడుతున్నారని ఫిర్యాదులో పొందుపరిచారు. మద్యం తాగి స్టేషన్‌కు రావడమే కాక ఒక్క రోజు కూడా విధి నిర్వహణలో ఫైర్ కాల్స్‌కు హాజరు కాలేదన్నారు. స్టేషన్ సిబ్బందిపై జులుం ప్రదర్శించడంతోపాటు ఆరోగ్యం బాగున్నప్పటికీ సిక్ లీవ్ పెట్టి రాజకీయ కార్యకర్తలతో తిరుగుతూ పైరవీలు చేస్తున్నాడన్నారు. రాష్ట్రస్థాయి నాయకులతో పరిచయాలు పెట్టుకుని జిల్లాలో అసోసియేషన్ ఎలక్షన్లు కూడా జరగకుండా జిల్లా ఫైర్‌మెన్ అసోసియేషన్ అధ్యక్షుడుగా చలామణి అవుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇటీవల మంగళగిరిలో సీఎం సెక్యూరిటీ డ్యూటీకి నియమించినప్పటికీ ఏడీఎఫ్ఓ చిన్నబజారితో గొడవ పెట్టుకుని 'నాకే డ్యూటీ వేస్తావా.. యూనిఫాం వేసుకుని నేను అక్కడ డ్యూటీ చేయాలా..?' అంటూ లెక్కలేనితనంతో ప్రవర్తిస్తున్నాడని, అతని వల్ల స్టేషన్‌లో మిగిలిన సిబ్బందిపై పనిభారం పడుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజ్‌కుమార్ ఆగడాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవడమే కాక సహోద్యోగులకు తగు న్యాయం చేయాల్సిందిగా కర్నూలు స్టేషన్ సిబ్బంది.. డీజీకి పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి అవినాష్ జయసింహను ఫోన్‌లో వివరణ కోరగా.. రాజ్‌కుమార్‌పై ఫిర్యాదు వచ్చిన మాట వాస్తవమేనన్నారు. ప్రస్తుతం తాను డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అంశంపై ఢిల్లీలో శిక్షణలో ఉన్నానని, రాగానే ఫిర్యాదుపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పదోన్నతులు సాధిద్దాం

- రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రవీణ్


డైరీని విడుదల చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్, జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, సంఘం నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వ్యవసాయాధికారులకు పదోన్నతులు సాధిద్దామని రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.ప్రవీణ్ అన్నారు. కర్నూలు ఉద్యానభవన్‌లో జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘంలో సభ్యులైన ఏవోలు, ఏడీఏ, డీడీఏలకు 2025వ సంవత్సరం డైరీ, బ్యాగ్ తదితర వాటిని పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. కోర్టు కేసులతో ఏవో నుంచి జేడీఏ వరకు ఏడేళ్లుగా పదోన్నతులు ఆగిపోయాయన్నారు. ఏవో, ఏడీఏలకు ఏడాది పొడవునా వాహన సదుపాయం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏడీఏ, ఏవో కార్యాలయాల నిర్వహణకు ప్రతి నెలా బిల్లులు సక్రమంగా చెల్లించడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. మండల వ్యవసాయ అధికారుల కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించడంపై కూడా ప్రభుత్వంతో చర్చిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ అధికారుల సమస్యలపై ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్‌తో చర్చించి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ్, దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో పరిష్కారం సాధ్యం కాని సమస్యలను రాష్ట్ర సంఘం ద్వారా పరిష్కరిస్తున్నామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏ సాలురెడ్డి, మహమ్మద్ ఖాద్రి, బాలవర్ధిరాజు, సునీత, అరుణకుమారి, వ్యవసాయ అధికారుల సంఘం నేతలు రామకృష్ణ, మధుమతి, ఏవోలు ఉషారాణి, శారద, అల్లీపీర, రాఘవేంద్ర, వెంకటరంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

- పోక్సో చట్టం కింద కేసు నమోదు

కోవెలకుంట్ల: కాటికి కాళ్లు చాచిన వయస్సులో బాలికపై ఓ వృద్ధుడు లైంగిక దాడికి యత్నించిన ఘటన మండలంలోని రేవనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. సీఐ హనుమంతు నాయక్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక పొలానికి వెళ్తుండగా వృద్ధుడు పక్కీరెడ్డి లైంగిక దాడికి ప్రయత్నించాడు. బాలిక కేకలు వేయడంతో సమీప పొలాల్లోని కూలీలు అక్కడికి చేరుకుని వృద్ధుడిని చితకబాదారు. బాలిక ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చి తల్లిదండ్రులకు విషయం చెప్పగా వారు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కాగా నిందితుడు తెలుగుదేశం పార్టీ మద్దతు దారుడు కావడంతో అతన్ని కేసు నుంచి తప్పించేందుకు ఆ పార్టీ నాయకులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. తప్పు చేసిన వ్యక్తిని వెనుకేసుకొస్తారా అని ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో టీడీపీ నాయకులు అక్కడి నుంచి జారుకున్నారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పక్కీరెడ్డిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విష్ణువర్ధన్‌కు అరుదైన గౌరవం

- అభినందించిన క్లస్టర్ యూనివర్సిటీ వీసీ


విష్ణువర్ధన్‌ను అభినందిస్తున్న క్లస్టర్ యూనివర్సిటీ వీసీ సాయిగోపాల్

కర్నూలు (సిటీ): దేవనకొండ మండలం కె.వెంకటాపురం గ్రామానికి చెందిన దేవరింటి ప్రకాష్, లక్ష్మీ దంపతుల కుమారుడు దేవరింటి విష్ణువర్ధన్ అరుదైన గౌరవాన్ని పొందారు. ఢిల్లీలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవాల్లో పాల్గొని అభినందలు అందుకున్నారు. దేవరింటి విష్ణువర్ధన్.. క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బీఏ థర్డ్ ఇయర్ చదువుతున్నారు. ఎన్‌సీసీలో చేరినప్పటి నుంచి ఎంతో ప్రతిభ కనబరచి వివిధ క్యాంపుల్లో అందరి మన్ననలు పొందారు. ప్రతిభ కనపరచడంతో రిపబ్లిక్ డే క్యాంప్ ఢిల్లీకి ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవాల్లో పాల్గొన్న విష్ణువర్ధన్‌కు గురువారం కాలేజీలో ఘన స్వాగతం లభించింది, అనంతరం కళాశాల నుంచి ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ ఆఫీస్ మీదుగా క్లస్టర్ యూనివర్సిటీ వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం క్లస్టర్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో వర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పాల్గొని డి.విష్ణువర్ధన్‌ను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లస్టర్ యూనివర్సిటీలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకుని ఉన్నత రంగాల్లో రాణించాలన్నారు. డి.విష్ణువర్ధన్‌ను ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్, సైన్స్ విభాగం డీన్ సత్యనారాయణ, కామర్స్ విభాగం డీన్ నాగన్న, ఎన్‌సీసీ అధికారి కాంబ్లి నాయక్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ (సీఈ) బాలసుబ్రహ్మణ్యం, ఎన్‌సీసీ క్యాడెట్ తండ్రి ప్రకాష్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

172 కేంద్రాల్లో 'పది' పరీక్షలు

- మార్చి 17 నుంచి నిర్వహణ

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి నిర్వహించాలని ఇటీవలే షెడ్యూల్ ప్రకటించారు. రెగ్యులర్ పదో తరగతి పరీక్షలకు కర్నూలు జిల్లాలో 172 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశారు. ఇందులో 20 కేంద్రాల్లోని రెండు నుంచి మూడు గదుల్లో ఓపెన్ టెన్త్ పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే ఇంటర్మీడియట్ పరీక్షలకు సైతం తొమ్మిది కేంద్రాలను ఎంపిక చేశారు. గతంలో రెగ్యులర్ టెన్త్ పరీక్షలు ఉదయం, ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు మధ్యాహ్నం వేళల్లో నిర్వహించేవారు. మధ్యాహ్నం వేళల్లో మాస్ కాపీయింగ్ జరుగుతోందని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ ఏడాది రెగ్యులర్ పరీక్షల సెషన్‌లోనే ఓపెన్ స్కూల్ పరీక్షలు నిర్వహించాలని పరీక్షల విభాగం ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు అవసరమైన సిబ్బందిని ఎంపిక చేసి జిల్లా పరీక్షల విభాగానికి సమాచారం ఇవ్వాలని కర్నూలు, ఆదోని, పత్తికొండ డివిజన్‌లకు చెందిన డివిజన్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లను పరీక్షల విభాగం అధికారులు కోరారు.

రెగ్యులర్ 'పది' పరీక్షలకు 38,568 మంది

రెగ్యులర్ పదో తరగతి పరీక్షలు రాసేందుకు జిల్లాలో 38,568 మంది విద్యార్థుల నామినల్ రోల్స్ నమోదయ్యాయి. వీటిని ప్రస్తుతం విద్యాశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి ఖరారు చేస్తున్నారు. ఓపెన్ టెన్త్ పరీక్షలకు 1,279 మంది అభ్యాసకులు, 1,700 మంది ఇంటర్మీడియట్ పరీక్షలు రాసేందుకు ఫీజులు చెల్లించారు.

విహారంలో విషాదం

- నీట మునిగి బాలుడి మృతి


మృతిచెందిన షేక్ రఫీ

కోడుమూరు రూరల్: స్నేహితులతో కలసి విహారానికి సుంకేసుల డ్యాం వద్దకు వచ్చిన షేక్ రఫీ (17)అనే బాలుడు నీట మునిగి మృతి చెందాడు. ఈ దుర్ఘటన గురువారం చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్రం రాజోలికి చెందిన షేక్ రఫీ అనే బాలుడు తోటి స్నేహితులైన షేక్ రహిమాన్, షేక్ గనితో కలిసి గురువారం సుంకేసుల డ్యాం వద్దకు విహారానికి వచ్చారు. అక్కడ ముగ్గురు కలిసి సరాదాగా డ్యాం కింద నదిలో ఉన్న మొరెన్న గుంత దగ్గర ఈత కొట్టేందుకు దిగారు. అయితే లోతు ఎక్కువగా ఉండడంతో ఈత కొడుతూ నదిలోకి వెళ్లిన షేక్ రఫీ రాలేక నీటమునిగాడు. దీంతో తోటి స్నేహితులిద్దరూ ఒడ్డుకు వచ్చి అక్కడున్న చేపలు పట్టే వారికి విషయం చెప్పారు. గజ ఈతగాళ్లు చాలాసేపు నదిలో గాలించి షేక్ రఫీ మృతదేహాన్ని బయటకు తీశారు. చిన్న వయస్సులోనే తండ్రి చనిపోవడంతో షేక్ రఫీ పదోతరగతి పూర్తి చేసి మగ్గం నేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. ఈ సమయంలో ఉన్న కుమారుడు నీట మునిగి చనిపోవడంతో ఆ తల్లి రోదిస్తున్న తీరు చూపరులను సైతం కంటతడి పెట్టించింది. గూడూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కర్నూలు డీసీసీ అధ్యక్షుడిని తొలగించాలి

- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహ


మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ, చిత్రంలో కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ (పీసీసీ) ఆదేశాలను ధిక్కరించిన కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పి.మురళీకృష్ణను తక్షణమే పార్టీ నుంచి తొలగించాలని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహ, కర్నూలు సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు జిలానీబాషా అన్నారు. గురువారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాలుగు నెలల క్రితం అన్ని జిల్లాల్లో ఉండే కార్యాలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పీసీసీ ఖాతాకు మళ్లించాలని ఆదేశాలు వచ్చాయన్నారు. అయితే పి.మురళీకృష్ణ.. ఆదేశాలను ధిక్కరించి కళా వెంకట్రావు పేరిట సొసైటీ, బ్యాంకు ఖాతాలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఆరు నెలల తరువాత కాంగ్రెస్ కార్యాలయం కళా వెంకట్రావు భవన్ పేరిట ఉండే ఆస్తులు కళా వెంకట్రావు సొసైటీ పేరు మీదకు మార్చుకొని, కాజేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు కర్నూలు డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణపై కాంగ్రెస్ నాయకులు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, కళా వెంకట్రావు పేరిట ఉన్న సొసైటీని రద్దు చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బాబురావు, బతుకన్న,అనంతరత్నం, ముసీద్‌పీర్ ఖాద్రి, రియాజ్, రజాక్, వలి, జాకీర్ హుస్సేన్, బాలస్వామి, అబూఖాన్, విశ్వేశ్వరరెడ్డి వెంకటరరెడ్డి, లారజస్సు పాల్గొన్నారు.

ఆఫీసులో పనిచేసే వారి కోసమే సొసైటీ

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పనిచేసే వారి కోసమే కళావెంకట్రావ్ భవనం పేరిట సొసైటీని రిజిస్ట్రేషన్ చేయించామని, ఇందుకోసం తీర్మానం చేసినట్లు డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ తెలిపారు. గురువారం రాత్రి ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆస్తులను కొట్టేయాల్సిన గత్యంతరం తనకు లేదని, అనవసర ఆరోపణలు చేయడం తగదన్నారు.

ఆశల దీపం ఆరిపోయింది


మణికంఠేశ్వర రెడ్డి (ఫైల్)

చేబ్రోలు/వెల్దుర్తి: ఒక్కొగానొక్క కుమారుడు. బాగా చదివి ప్రయోజకుడై కుటుంబానికి ఆసరాగా ఉంటాడని తల్లిదండ్రులు కలలుగన్నారు. వారి కలలను మృత్యువు పొట్టన పెట్టుకుంది. ఉన్నత విద్య చదువుకునేందుకు వెళ్లిన కుమారుడు విగతజీవిగా తిరిగిరావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలోని గుంటూరు – తెనాలి రహదారిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలుకు చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందాడు. కర్నూలుకు చెందిన లక్ష్మీరెడ్డి, ఊర్మిల దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సొంతూరు వెల్దుర్తి కాగా ఉపాధి నిమిత్తం కర్నూలుకు చేరుకుని అక్కడే స్థిర పడ్డారు. వీరి కుమారుడు మణికంఠేశ్వరరెడ్డి(25) గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి యూనివర్సిటీ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో మణికంఠేశ్వరరెడ్డి దుర్మరణం చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మీరెడ్డి కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తా ఏరియాలో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుమార్తెకు వివాహం చేశారు. కుమారుడు మణికంఠేశ్వరరెడ్డి బీఎస్సీ అగ్రికల్చర్ డెహ్రాడూన్‌లో పూర్తి చేశాడు. ఎంబీఏ కోసం చేబ్రోలు వచ్చాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెల్దుర్తి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, పలువురు నేతలు, కుటుంబసభ్యులు చేబ్రోలు చేరుకున్నారు. చేబ్రోలు ఎస్ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

మిడుతూరు: మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామంలో గురువారం గుర్తుతెలియని వాహనం ఢీకొని పొలానికి వెళ్తున్న ఓ మహిళ దుర్మరణం చెందింది. ఎస్ఐ ఓబులేసు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మాధవరెడ్డి భార్య మహేశ్వరమ్మ(48) గ్రామ శివారులోని పొలానికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ల్యాబ్‌టెక్నీషియన్ మెరిట్‌జాబితా విడుదల

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖలో భర్తీ చేయబోయే ల్యాబ్‌టెక్నీషియన్ ఐదు పోస్టులకు సంబంధించిన మెరిట్ జాబితాను వెబ్‌సైట్ https://kurnool.ap.gov.in, nandyal.ap.gov.inలో ఉంచినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ పి. శాంతికళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 7, 8వ తేదీల్లో సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో రాతపూర్వకంగా తెలపాలన్నారు.

24 నుంచి వాటర్‌షెడ్ యాత్ర

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల జిల్లాలో ఈ నెల 24, 25 తేదీల్లో, కర్నూలు జిల్లాలో 25 నుంచి 27 వరకు వాటర్‌షెడ్ యాత్ర జరుగుతుందని అదనపు పీడీ మాధవీలత తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నంద్యాల జిల్లాలో ఆకుమల్ల, ఎద్దుపెంట, కర్నూలు జిల్లాలో హాలహర్వి పెద్దహరివాణం, కందనాతి, హుస్సేనాపురం గ్రామాల్లో ప్రత్యేక వాహనంతో వాటర్‌షెడ్ యాత్ర జరుగుతుందని పేర్కొన్నారు. వాటర్‌షెడ్లపై ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు కేంద్రప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు.

ధైవ దర్శనానికి వెళ్లి వస్తూ..

- ఓర్వకల్లు సమీపంలో ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు
- కర్ణాటకకు చెందిన ఇద్దరు మృతి
- మృతుల్లో ఆరేళ్ల చిన్నారి
- రాంగ్ రూట్లో ట్రాక్టర్ వెళ్లడంతో ప్రమాదం


ప్రమాదంలో బోల్తా పడిన తవేరా వాహనం

ఓర్వకల్లు: చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిపై ఓర్వకల్లు పవర్ గ్రిడ్ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటకకు చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. తిరుమలకు వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం రాయచూరు పట్టణానికి చెందిన జానకి శ్రీలక్ష్మి(42) ఏటా రథ సప్తమికి తిరుపతికి వెళ్తుంది. ఈ ఏడాది కూడా తన ఇంటి పక్కన ఉండే ఉమ, సరోజ, ఈరమ్మ, కవిత, లక్ష్మి, రాఘవి, విరానిక శ్రీ, రితిన్ రెవన్, నాగరాజు, జయరాం, నిహారికను వెంట తీసుకెళ్లింది. రథసప్తమి వేడుకలను తిలకించి, సమీపంలోని ఇతర పుణ్యక్షేత్రాలను దర్శించుకుని గురువారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో సాయంత్రం ఓర్వకల్లు సమీపంలోని పవర్‌గ్రిడ్ సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. హెచ్.కొట్టాలకు వెళ్లాల్సిన ట్రాక్టర్ యూటర్న్ వద్ద రాంగ్ రూట్‌లో వెళ్తుండటంతో కారు ఢీకొని డివైడర్‌పై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జానకి లక్ష్మిశ్రీ, రాఘవి కుమార్తె విరానిక శ్రీ(6) చిన్నారి తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. రాఘవి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ట్రైనీ డీఎస్పీ ఉషారాణి, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబునాయుడు, ఎస్ఐ సునీల్‌కుమార్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.